# ఆస్తి

రచన:
శ్రీ ద్విభాష్యం రాజేశ్వరరావు

మబ్బులు కమ్మిన ఆకాశం మెల్లగా ఉరుముతోంది. విషాదవదనంమీది చిరునవ్వులా, మెరుపులు మెరిసి మాయమవుతున్నాయి. నిన్నటి ఉదయం ప్రారంభమయిన ముసురు ఇంకా తగ్గలేదు.

శంకరం మోకాళ్ళలో తలదూర్చుకొని వీధి అరుగుమీద కూలబడ్డాడు. నిన్నటినుండీ అదే పనిగా ఏడవటంవలన అతనికళ్ళు ఎర్రబారి, ఉబ్బివున్నాయి. జుత్తు చిందరవందరగా వుంది.

+ + +

శంకరం ఇపుడు ఏడవటంలేదు! అతనిలో ఏడిచేశక్తి, ఓపికనశించాయి! బాధలో మెలికలు తిరిగిన మెదడు ఏమీ పనిచేయటంలేదు! శంకరం తలఎత్తి శూన్యంలోకి చూస్తూకూర్చున్నాడు. లోపలిగదిలోనుండి సన్నగా, నిస్సహాయంగా రోదనవినిపిస్తోంది! అమ్మ ఏడుస్తోంది!_ అవును! ఏడుస్తోంది! తనుపుట్టినతరువాత ఈపదహారుసంవత్సరాలలోనూ అమ్మఏడటం తను ఎన్నడూ చూడలేదు! అమ్మ ఎంతో అందంగావుంటుంది! ఆమె ముఖంపై ఎప్పుడూ చిరునవ్వు నాట్యమాడుతూవుండేది! కానినిన్న ఉదయం మాయమయిన చిరునవ్వు ఆమె వదనంమీదకు మళ్ళీ ఎప్పుడువస్తుందో! ఏమో! ఇక రాదేమో!

నిన్న ఉదయం తొమ్మిదిగంటలసమయంలో_ఆకాశం విలపిస్తున్నట్లు భోరుమని వర్షంకురుస్తున్నపుడు _ ఈ ఇంట్లో, తన ఊహకు అందనిది జరిగిపోయింది! నాన్న- అమ్మకు, తనకు దైవస్వరూపం అయిన నాన్న!_ఆఫీసరుచేత 'ఇంతకు మంచిగుమాస్తాని నాసర్వీసులో చూడలేదు! అనిపించుకున్న నాన్న!_ఊరిలో ప్రజల' చలపతిరావంత మంచిమనిషిని మరి చూడవేం!' అని పేరుసంపాదించుకున్న నాన్న!_తన ముప్ఫయి ఎనిమిదేళ్ళవయసుకే; గుండెపోటువలన హఠాత్తుగా తనని, అమ్మని దిక్కులేనివాళ్ళగాజేసి మరోలోకాలకు వెళ్ళిపోయాడు!

నిన్న ఉదయం ఎనిమిదిన్నరగంటలకు నాన్నగుండెనొప్పితో మూల్గుతూవుంటే, అమ్మతననుపిల్చి డాక్టరును తొందరగా తీసుకురమ్మని పంపించింది. బాధతో మెలికలు తిరిగిపోతున్న నాన్నను చూస్తే తనకు భయవేసింది!

పరుగున వెళ్లి డాక్టర్ని వెంటబెట్టుకొని వచ్చాడు!

అప్పటికే ఇంటిముందు చాలమంది గుమిగూడి రకరకాలుగా మాట్లాడుకుంటున్నారు. గుంపుత్రోసుకొని గాభరగా ముందుకువెళ్ళిన తనను ఎదుటిదృశ్యం సబుణిచేసింది!

నాన్నని నేలమీద పడుకోబెట్టారు!

అమ్మ గుండెలుబాదుకుంటు నాన్నమీద పడి విలపిస్తోంది!

తనకు కాళ్ళు, చేతులు ఆడలేదు! గుండెల్లో దడప్రారంభమయింది. కట్టలు తెంచుకొని పొంగివచ్చిన దుఃఖాన్ని దిగమింగులేక, ఏడుస్తు నాన్న తలవద్ద కూర్చుండిపోయాడు!

వచ్చిన డాక్టరు నాన్నను చూడవలసిన అవసరం లేకపోయింది! వచ్చిన డాక్టరు వచ్చినట్లే వెళ్ళిపోయాడు!

వచ్చినమృత్యువు మాత్రం నాన్నను వెంటబెట్టుకొని వెళ్ళిపోయింది! మధ్యాహ్నం మూడుగంటలకు నాన్న శవం సన్నని తుంపరలమధ్యలోనే ఇంట్లోంచి బయటకు వెళ్లిపోయింది.

చీకటిపడేవరకూ అమ్మను, తనను ఓదార్చి ఎవరిమటుకు వాళ్ళు వెళ్ళిపోయారు. రాత్రిపక్క ఇంటి మాస్టారి భార్య అన్నంవండి తీసుకువచ్చింది. అమ్మ ఒక్క మెతుకయినా ముట్టలేదు. తను నాలుగు మెతుకులు కెలికి, నాన్న జ్ఞాపకానికివస్తే మరి తినలేక లేచిపోయాడు.

పక్కింటి ఆవిడ వెళ్ళిపోయాక మెల్లగా గదిలోకి వెళ్ళాడు. గదిలో దీపంలేకపోవటంవలన చీకటిగా వుంది. వీధివరండాలోని దీపపువెల్తురు పల్చగా కిటికీగూటిలో పడుతోంది. మంచంమీద పడుకొని దిండులో ముఖందాచుకుని సన్నగా విలపిస్తోంది అమ్మ!

ఉదయంనుండీ ఆమెను పలుకరించే ధైర్యమయినా తనకు లేకపోయింది. భయంగా అడుగులు వేసుకుంటూ మంచం వద్దకు వెళ్ళాడు. ఆస్థితిలో ఆమెను చూస్తూవుంటే మనసంతా వికలమయిపోయింది నిండా, ముప్ఫయినాలుగు వసంతాలయినా చూడని అమ్మజీవితానికి అప్పుడే వైధవ్యం ప్రాప్తించింది! ఆమె జీవితం అంధకారమయిపోయింది! మెల్లగా అమ్మ భుజాలమీద చేతులువేసి 'ఏడవకమ్మా! నాకు భయంవేస్తోంది.' అన్నాడు రుద్ధకంఠంతో, ఆమాటలకు అతడు ఎంతోసేపు తడుముకోవలసి వచ్చింది. మేరుపర్వతంలాటి మనిషి అమ్మ! ఎంతబాధనయినా గుండెల్లో దాచుకొని, చిరునవ్వు నవ్వగల్గిన దేవత-అమ్మ; ఆలాటి అమ్మను, తను ఈదినం సముదాయించవలసివస్తోంది! చిన్నమాటతోనయినా ఎవర్నీ, ఎప్పుడూ కించపరచటంగాని, నొప్పించటంకాని అమ్మకు తెలియదు. నిన్నటివరకూ నాన్నతోటిదే లోకంగా గడిపింది. ఆలాటి అమ్మకు ఎంతకష్టంవచ్చింది? తనకు మళ్ళీ ఏడుపు ముంచుకొచ్చింది!

తనను దగ్గరగా తీసుకొని 'శంకరం' అంటూ బావురుమంది అమ్మ! ఆమెలో అంతవరకూ క్రమేణా అణిగిపోతోందనుకున్న దుఃఖం మళ్ళీ పెల్లుబికింది. 'శంకరం! నిన్నూ, నన్నూ, దిక్కులేనివాళ్లను చేసి వెళ్ళిపోయారు మీ నాన్న!' అన్న ఆమె మాటలు రోదన మధ్యలోనే నలిగిపోయాయి. తను నీరసంగా అమ్మ గుండెలమీదకు వాలి నిద్రలోకి జారిపోయాడు!

తనకు తెలివివచ్చేసరికి అమ్మ ప్రక్కలో వున్నాడు. అమ్మ నిద్రపోతోంది! ఆమెకంటినుండి జారిన కన్నీటిచారలు బుగ్గలమీద స్పష్టంగా కనిపిస్తున్నాయి. సాయంకాలపు అరుణబింబంలా మెరిసిపోయే ఆమెనుదుటి కుంకుమబొట్టు, ఆ స్థానంలో మాయమయింది! ఆనవాలుగా మిగిలిన కుంకుమజాడ వెలవెలబోతున్నట్లుగా వుంది! ముసురుపట్టిన ఆకాశంలావుంది ఆమె ముఖం! ఇక, ఆమె ముఖం చూడలేక మెల్లిగా లేచి నీరసంగా అడుగులు వేసుకుంటూ వీధివరండాలోకివచ్చి మోకాళ్ళలో తలపెట్టుకొని కూర్చున్నాడు శంకరం!

\+ + +

మబ్బులు కమ్మిన ఆకాశం మెల్లగా ఉరుముతోంది! విషాదవదనంమీద చిరునవ్వులా మెరుపులు మెరిసిమాయమవుతున్నాయి. నిన్నటి ఉదయం ప్రారంభమయిన ముసురు ఇంకా తగ్గలేదు!

శంకరం మోకాళ్లలో తలదూర్చుకొని వీధి అరుగుమీద కూలబడ్డాడు. నిన్నటినుండి అదేపనిగా ఏడవటంవలన అతనికళ్ళు ఎర్రబారి ఉబ్బివున్నాయి. జుత్తు చిందరవందరగా వుంది!

నిన్నరాత్రి నిద్రలోకి జారిపోయినపుడు అంతమయినబాధ అతనిలో మళ్ళీ ప్రారంభమయింది! తండ్రి చనిపోయిన దిగులుతోబాటు, ఇపుడు అతనిలో ఇంకొక కొత్తరకమయిన బాధకూడా ప్రవేశించింది.! రేపటినుండీ తననూ, అమ్మనూ పోషించేవాళ్లు ఎవరు?' అన్న ప్రశ్న అతనిలో పాములాపడగఎత్తింది! తనకు అన్నదమ్ములుకాని, అక్కచెళ్ళుకాని ఎవ్వరూలేరు! అమ్మనూ, తననూ చేరదీసి ఆదరించే దగ్గరబంధువులు కూడా ఎవరూ ఉన్నట్లు తనకు తెలీదు!

నాన్నచేసిన ఉద్యోగం గుమాస్తా గిరీ! అందులోనూ ఆదర్శలకోసం-ఆశయాలకోసం, నిజాయితీకోసం ప్రాణం ఒడ్డినవ్యక్తి అతను! 'చలపతిరావు చాలా నిఖార్సయిన మనిషి! కానీ కూడా లంచంతీసుకోడు!' అని నాన్న ఆఫీసుకు సంబంధించిన కంట్రాక్టర్లు అనుకోవటం తాను ఎన్నోసార్లు విన్నాడు. ఈ విషయంలో అసత్యంకూడా ఏమీలేదు! అతడు బ్రతికిన ఆఖరు క్షణాలవరకూ ఆదర్శాలకోసం తన జీవితాన్ని బలిచేసుకున్నాడు! రేషను షాపులో బియ్యం లభించకపోతే బ్లాకులో బయటకొనకుండా గోధుమలు తింటూగడిపిన దినాలు ఎన్నో తనకు తెలుసును! అమ్మను కాని కట్నం తీసుకోకుండా వివాహం చేసుకోవటంనుండి, ఆఫీసులో లంచంతీసుకోకుండా తన విద్యుక్తధర్మం నెరవేర్చటంవరకూ అన్న అతడు ఆదర్శాలకోసమే ఆదరించాడు!

కాని ఈనాటిపరిస్థితి?

ఇంట్లోవున్న డబ్బుతో ఇంకొక నెలరోజులుకూడా గడవటం కష్టమయిపోతుందేమో! తరువాత తనను, అమ్మను ఎవరు ఆదరిస్తారు?

ఇంకొకరి దయాదాక్షిణ్యాలమీద ఆధారపడకుండా ఇంతకాలం తమ సంసారం గుట్టుగాసాగిపోయింది! ఇక ముందుకూడా అలా సాగిపోవాలంటే-తను ఉద్యోగం ఏదైనా చెయ్యాలి! అది ఒక్కటే మార్గం!

తను ఉద్యోగం చెయ్యాలి! కాని ఎలా?

డిగ్రీలుపొంది ఉద్యోగాలకోసం అల్లాడిపోతున్న ఈ సమయంలో తన స్కూలుఫైనల్ క్వాలిఫికేషనుకు ఎవరిస్తారు ఉద్యోగం? నిండా పదిహేడేళ్ళు నిండని తన కోరికను ఎవరుహర్షిస్తారు? భవిష్యత్తు తల్చుకుంటూ వుంటే శంకరం మనసు భయంతో బాధతో నిండిపోయింది. ఏమీ ఆస్తివదలకుండా తననెత్తిమీద ఇంత భారంవదిలి వెళ్ళిపోయిన నాన్నమీద కాస్తకోపంకూడా ఆబాధలో ఏమూలనో చోటుచేసుకుంది!

\+ + +

రెండువారాలు పీడించిన ముసురు తగ్గుముఖం పట్టింది! చీకాకుగా వున్న జగతికి కాస్త హుషారులభించినట్లయింది! శంకరం తండ్రికి జరిపించవలసిన కర్మకాండ అంతా యధావిధిగా జరిపించాడు. ఇంట్లోవున్న డబ్బు చాలావరకూ ఖర్చుఅయిపోయింది, ఆ దినంవరకూతండ్రి తరపు వ్యక్తులమని చెప్పుకుని ఇంట్లోవిడిచి చేసినవాళ్లందరూ కళ్ళుతుడుచుకొని ఒక్కరొక్కరే ప్రయాణం కట్టారు.

తన తండ్రికి మేనమామవరుస అవుతటడ! ఆయన వెళ్లిపోతూ అమ్మనుపిల్చి అడిగాడు 'చూడమ్మ! జరిగిపోయిందేదో జరిగిపోయింది! ఇక జరుగవలసినది ఏదోనువ్వు చూడాలి. ఇంతకీ, మాచలపతి డబ్బు ఏమైనాజాగ్రత్త చేశాడా? లేదా?'


అమ్మా కన్నీళ్ళుఒత్తుకుంటూ అంది' లేదండీ బాబయ్యగారూ! ఆయన వున్నప్పుడు గుట్టుగాసంసారం సాగింది. ఆయన సంగతి మీకు తెల్సుగా! నిప్పులాంటి మనిషి! ఒక్కనయాపైసకూడా ఆయన తన జీవితంలో అన్యాయార్జితం చెయ్యలేదు! ఆయనకు నెలనెలావచ్చే నూటయాభయి జీతపురాళ్లతో రోజుగడవటమే కష్టమయేది. ఆయన ఏమైనా ఆస్తివదిలి వెళ్లారూ అంటే, అది కాస్తా ఆయనదినాలకే ఖర్చయింది. ఆయన మంచితనం తప్ప, మాకు ఆస్తి ఏమీవదలిపోలేదు! ఇకముందు రోజులు ఎలాగడుస్తాయో అని భయంగావుంది!'

ఆ మాటలు చెప్తుంటే అమ్మ కంఠంవణికింది! భవిష్యత్తు అంటే దిగులు, భయం ఆ గొంతులో ధ్వనించాయి!

ముసలాయన ఉస్సురని నిట్టూర్చాడు.

'అవునమ్మా! వాడు బ్రతికినంతకాలం కూడుపెట్టని ఆశయాలకోసమే ప్రాకులాడాడు! అందుకే నాలుగు


మా ఖాతాదారులకు, వాడుకదారులకు హృదయపూర్వకమైన దీపావళి అభినందనలు




ఆంధ్రప్రదేశానికి సోల్ ఏజెంట్లు : జి. వి. పరుశురామ్ & కంపెని.
11-4-658/2 లకిడికాపూల్, హైదరాబాద్-4. A.P

PONMANI

• శ్రేష్ఠమైన రకం
• తక్కువ ధర
• చిరకాల మన్నిక
• చక్కని అల్లిక
ఇవే



# పొన్‌మని బనియన్ల విశిష్టత

(ఏజెంట్లు లేని ఊళ్ళో ఏజెంట్లు కావలెను)

: వివరములకు :

పొన్‌మని నిట్టింగ్ కంపెని
పి. ఎన్. రోడ్డు : : తిరుపూరు.

PONMANI KNITTING CO.,
P.N. ROAD :: TIRUPUR (SI)

రాళ్ళు వెనకేసుకోలేకపోయారు! ఈ కాలంలో మంచితనం ఎవరికి కావాలి? మీ దరిద్రం తీరటానికి వాడి మంచితనం ఏం ఉపకరిస్తుంది? వారు బ్రతికివున్నంతకాలం 'నేను చెప్తూనే వుండేవాణ్ణి' భార్యనూ, బిడ్డనీ అన్యాయం చెయ్యకు! వాళ్ళకోసమయినా నాలుగు రాళ్ళు లంచం తీసుకొని వెనకెయ్యమని! కాని వాడు నామాట ఎప్పుడుమాత్రం లక్ష్యపెట్టాడు ఆఫీసులో వాడి 'సీటు' ఎలాంటిదనుకున్నావ్? 'ఊ' అంటే వందలకొద్దీ వచ్చిపడుతుంది! బ్రతికినంతకాలం ఆ అవకాశం వాడు వినియోగించుకోలేకపోయాడు! ఎందుకూ కొరగాని ఆశయాలు పట్టుకు పాకులాడి, చివరకు మిమ్మల్ని అన్యాయం చేసిపోయాడు!'

ముసలాయన దీర్ఘోపన్యాసం ఇచ్చి పైమీద కండువాతో కళ్ళు ఒత్తుకొని చక్కాపోయాడు. ఆయన మాటల్లో; తన తండ్రిమీద నిష్ఠూర మాడటం తప్ప, సమస్య పరిష్కారమయ్యే సూచనలు ఏమీ శంకరానికి కన్పించలేదు! ఆ పరిస్థితిలో ఇక తల్లితో ఏం మాట్లాడటానికీ తోచక, బట్టలు మార్చుకొని ఇంట్లోంచి బయటపడ్డాడు!

\+ \+ \+

ఆ సాయంత్రం తన తండ్రి పనిచేసిన ఆఫీసునుండి కబురు వస్తే బయలుదేరి వెళ్ళాడు శంకరం.

ప్యూను శంకరాన్ని ఆఫీసరుగారి గదిలోకి తీసుకువెళ్ళాడు. ఆఫీసరు సాదరంగా ఆహ్వానించారు. ఆయన ఎదుట కుర్చీలో వినమ్రంగా ఆశీనుడయ్యాడు శంకరం. ఆయన చుట్ట ముట్టించి హాందాగా పొగ వదులూ అన్నారు 'బాబూ! నీ పేరేమిటి?' ఆయన ముఖం ఎంత గంభీరంగా వుందో మాటలు అంత వాత్సల్యపూరితంగా వున్నాయి. శంకరం తన పేరు చెప్పాడు.

'చూడు శంకరం! చలపతి ఈ ఆఫీసులోని గుమస్తాలందరిలోనూ నాకు అత్యంత ఆప్తుడిగా వుండేవాడు అతని నిజాయితీ, మంచితనం, క్రమశిక్షణ చూసి నేను ఎన్నో విషయాలు నేర్చుకున్నాను. ఆఫీసులో పనిచేసే ఇతర గుమాస్తాలకుకూడా అతడు ఒక ఆదర్శప్రాయమయిన వ్యక్తిగా మెలిగేవాడు. అటువంటి వ్యక్తిని పోగొట్టుకోవటం నిజంగా మనందరి దురదృష్టం అనుకోవాలి! మంచివాళ్ళను భగవంతుడు త్వరగా తనవద్దకు చేర్చుకుంటాడు.' మాట్లాడటం ఆపి నిట్టూర్చారు ఆయన. మాట్లాడుతూవుంటే ఆయన నేత్రాలు చెమర్చాయి.

తన తండ్రిమీద ఆపీసరుగారికి వున్న గౌరవం చూస్తే శంకరానికి మనసు పులకించింది.

'నువ్వేం చదువుకున్నావ్?' రుమాలుతో కళ్ళు ఒత్తుకుంటూ అడిగారు ఆయన.

‘స్కూల్ ఫైనలు ప్యాసయ్యానండీ!’ అన్నాడు శంకరం వినయంగా.

‘చలపతిరావు ఈ ఆఫీసుకు ఎంతో సేవ చేశాడు! అతను చేసిన సేవకు ఏదో ఒక రూపంలో నేను ప్రత్యుపకారం చేద్దామనుకుంటున్నా. అతను పోయాక ఆ స్థానం ఇంతవరకూ ఖాళీగానే వుంది. నీకిష్టమయితే రెండు రోజుల్లో వచ్చి మా ఆఫీసులో చేరిపో! మూడు నెలల ట్రయినింగు తరువాత ఆ ఖాళీలో నిన్ను నియమిస్తాను! ఆలోచించుకొని నీ అభిప్రాయం రేపు తెలియజేయి!’

శంకరం తన చెవులను తానే నమ్మలేకపోయాడు.

‘తాను వింటున్నది నిజమా? అబద్ధమా?’

ఆనందంతో, సంభ్రమంతో అతని కళ్ళు చెమర్చాయి.

తన అంగీకారాన్ని ఎలా తెలియజేయాలో కూడా తెలియని పరిస్థితిలో కొంతసేపు వుండిపోయాడు.

‘తప్పకుండా చేరుతానండీ! మీ ఋణం ఎలా తీర్చుకోవాలో అర్థం కావటంలేదు!’ అన్నాడు.

‘శంకరం! ఇందులో నువ్వు నాకు తీర్చవలసిన ఋణం ఏమీ లేదు! నిన్ను ప్రత్యేకం పిలిచి ఈ ఉద్యోగం ఇస్తున్నానంటే అందుకు కారణం తెలుసునా? మీ నాన్న సంపాదించిన కీర్తిప్రతిష్ఠలే!

అతను మీ కుటుంబాన్ని ఎప్పుడూ కాపాడే మంచితనం ఆర్జించి చనిపోయాడు! అంతకంటే మంచి ఆస్తి ఎవరు ఆర్జిస్తారు?

నీ విధి నిర్వహణలో అతని అడుగుజాడల్లోనే నడుచుకో!

అతడు మిగిల్చిన ఆస్తిని నువ్వు రెట్టింపు చెయ్యాలి! మంచితనంలో తండ్రిని మించిన తనయుడని నువ్వు అనిపించుకోవాలి!

ఇక నువ్వు వెళ్ళిపో! ‘ఎల్లుండివచ్చి పనిలో చేరిపో!’

శంకరం మనసు తండ్రిమీది భక్తిభావంతో నిండిపోయింది.

ఆఫీసరుగారికి తన కృతజ్ఞత తెలియజేసి, ఆయనవద్ద శెలవు తీసుకొని బయటకువస్తూ అనుకున్నాడు.

‘ఆఫీసరుగారు చెప్పింది నిజం! మంచినిమించిన ఆస్తి మరొకటి ఏముంటుంది? తప్పకుండా తను మంచితనంగా మసులుకొని నాన్న పేరు నిలబెట్టాలి! ఏ తండ్రిమాత్రం కొడుక్కి ఇంతకంటె విలువయిన ఆస్తి ఇవ్వగలడు?’


ఆనందంతో ఉబికివస్తున్న అశ్రువులు తుడుచుకుంటూ ఇంటివైపు నడక సాగించాడు శంకరం.

OUR NEW ADDITION

SEI To meet the needs of Agriculture & Industry "SEI" the most trusted name in


PUMPING SETS & MOTORS

For more water & Bumper Crops



"SEI" totally enclosed Motor with Pump.

Use "SEI" Products or Prosperity & Progress



"SEI" totally enclosed Monobloc.

MANUFACTURERS :
SOUTHERN ENGINEERING INDUSTRIALS.
343, Avanashi Road, Coimbatore-18.

★

Selling Agents, S. India:
M/s.Gordon Woodroffe Agencies Private Ltd.,
1/21, North Beach Road,
P. B. No. 42, Madras-1.